క్లుప్తంగా

ఆలయ ధర్మకర్తల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

మంగళగిరి టౌన్: మంగళగిరి నగర పరిధిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ధర్మకర్తల సభ్యుల నియామకానికి దరఖాస్తు చేసుకోవాలని ఆలయ కార్యనిర్వహణాధికారి సునీల్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు దేవస్థానంలోని కార్యాలయంలో దరఖాస్తు ఫారం తీసుకుని పూర్తి చేసి ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు కార్యాలయంలో అందజేయాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

మహిళలకు కుట్టు శిక్షణ ప్రారంభం



దుగ్గిరాల: స్త్రీ శక్తి ద్వారా కుట్టు మిషన్ శిక్షణ ప్రారంభించినట్లు తద్వారా మహిళల ఆర్థిక ఎదుగుదలకు సహకరిస్తుందని ఎంపీపీ షేక్ జబీన్ తెలిపారు. సోమవారం రేవేంద్రపాడు గ్రామంలోని కుట్టు మిషన్ సెంటర్‌ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ స్త్రీలు సొంతంగా ఎదిగేందుకు స్వయం ఉపాధిలో భాగంగా, ఆర్థిక స్వావలంబనకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందని అన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌తో పాటు కుట్టు మిషన్ అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో యార్డు చైర్మన్ వి.ఝాన్సీరాణి, కె.శ్రీ అనిత, గ్రామ సర్పంచ్ పి.మేరిమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో 200 మందికి పరీక్షలు



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని మహానాడు ఈ-మామూర్ మసీదు ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మహానాడు పరిసర ప్రాంత ప్రజల కోసం ఉచితం వైద్య శిబిరాన్ని నిర్వహించామని, సుమారు 200 మంది వైద్య శిబిరంలో వివిధ రకాల పరీక్షలు చేయించుకున్నారని, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశామని తెలిపారు. జమాతే ఇస్లామీ హిందూ సంస్థకు చెందిన డాక్టర్లు వైద్య సేవలు అందించారని, వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ముతవల్లి ఎస్కే పెద్ద బుడే, ఎండీ అబ్దుల్ లతీఫ్, ఇర్ఫాన్, బాషా, సర్దార్, ఎస్‌కే బాషా తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ముందు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి

సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి, ఐఎఫ్‌టీయూ నాయకులు



తాడేపల్లి రూరల్: విద్య, ఐటీ శాఖల మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్ ఎన్నికల ముందు కార్మికులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, ఐఎఫ్‌టీయూ నాయకులు కె.ఆదినారాయణ డిమాండ్ చేశారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు గత 251 రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్న శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు నారా లోకేష్ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను తీరుస్తానని హామీ ఇచ్చారని, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరుతున్నామన్నారు. నాయకులు ఆదినారాయణ, కేసీ వర్క్స్ యూనియన్ కార్యదర్శి కూరపాటి స్టీవెన్ సుభాని, యెహోషువా, పిచ్చయ్య, గురవయ్య, కార్మికులు సందం దేవరాజు, కె.హగ్గయ్య, వెంకట రమణ, రిబ్కా, ఉదయగిరి రమణ తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న బాలుడు



మంగళగిరి టౌన్: దొరికిన పర్సును పోలీసులకు అప్పగించి నిజాయితీని చాటుకున్నాడు ఓ బాలుడు. ఈ ఘటన మంగళగిరి పట్టణంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరుకు చెందిన కటికం భారతి సోమవారం ఉదయం మంగళగిరిలో ఎయిమ్స్ ఆసుపత్రికి వచ్చింది. సాయంత్రం తిరుగు ప్రయాణంలో మంగళగిరి బస్టాండ్‌కు ఆటోలో వస్తూ పర్సు పోగొట్టుకుంది. అదే సమయంలో గుంటూరు వెళ్లడానికి రిటైర్డ్ ఆర్పీఎఫ్ ఉద్యోగి తన కుమారుడితో బస్టాండ్‌కు వచ్చాడు. ఉద్యోగి కుమారుడికి పర్సు కనబడడంతో మంగళగిరి పట్టణ పోలీస్ స్టేషన్ అప్పగించాడు. అప్పటికే బాధితురాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పర్సులో బంగారు చెవిదుద్దులు సుమారు రూ.4 వేలు, ఏటీఎం కార్డులు ఉన్నట్లు పేర్కొంది. పర్సును సీఐ వీరాస్వామి భారతికి అందజేయగా, అన్నీ ఉండడంతో పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది. నిజాయితీ చాటుకున్న బాలుడిని సీఐ అభినందించారు.

ఈ ప్రయాణం.. ప్రమాదం

- పరిమితికి మించి ఆటోల్లో వెళుతున్న ప్రయాణికులు
- మితిమీరిన వేగంగా వెళుతున్న వాహనాలు
- పట్టించుకోని అధికారులు



ఆటోలో నిలబడి ప్రయాణిస్తున్న ప్రజలు



ఆటో వెనక కూర్చుని ప్రయాణిస్తున్న వ్యవసాయ కూలీలు

ఫిరంగిపురం: ఆటోలు, జీపుల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోకూడదు. కానీ మండలంలోని పలు గ్రామాల్లో ఆటోలు, ట్రాక్టర్లు, మినీ లారీల్లో పరిమితికి మించి విద్యార్థులు, కూలీలు తదితర ప్రయాణికులను తీసుకువెళుతున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో తెలియని పరిస్థితి. ప్రజలు అనుక్షణం భయం భయంగానే ప్రయాణిస్తున్నారు.

ప్రమాదమని తెలిసినా...

పొలం పనుల కోసం వ్యవసాయ కూలీలను తీసుకువెళ్లేందుకు ఆటోలు, ట్రాక్టర్లు, మినీ లారీలను వినియోగిస్తున్నారు. ఆయా వాహనాల్లో పరిమితికి మించి కూలీలను ఎక్కించి తీసుకువెళుతున్నారు. వాహన డ్రైవర్లు మితిమీరిన వేగంతో ప్రయాణిస్తున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయపడాల్సి వస్తుంది. ప్రమాదమని తెలిసినా బతుకుదెరువు కోసం గత్యంతరం లేక వ్యవసాయ కూలీలు వాహనాల్లో ఇరుకుగా నిలబడి మరీ ప్రయాణిస్తున్నారు.

- పలు గ్రామాల నుంచి ఫిరంగిపురంలోని పాఠశాలలు, కళాశాలలకు విద్యార్థులు ఆటోల్లో రావాల్సి ఉంటుంది. ఆటో డ్రైవర్లు వాహనంలో అధిక సంఖ్యలో విద్యార్థులను తీసుకువస్తున్నారు. ఖాళీ లేక విద్యార్థులు ఆటో వెనుక భాగంలో నిలుచేని మరీ ప్రయాణం సాగిస్తున్నారు. ప్రమాదం అని తెలిసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆటోల్లోనే పంపించాల్సి వస్తుందని తల్లిదండ్రులు చెబుతున్నారు. వ్యవసాయ కూలీలు, విద్యార్థులు, వివిధ పనుల నిమిత్తం గ్రామాల నుంచి పట్టణాలకు వెళ్లే వారికి ఈ ప్రమాదపు ప్రయాణాలు తప్పడం లేదు.

తూతూ మంత్రంగా తనిఖీలు

గుంటూరు–కర్నూలు రాష్ట్ర రహదారిపై పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణికులు వెళుతున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవని ప్రజలు అంటున్నారు. తూతూ మంత్రంగా తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రమాదాలు సంభవించక ముందే సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకుంటే పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణాలకు అడ్డుకట్ట వేసి ప్రమాదాలు నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రయాణాలను అరికట్టాలి



పలు గ్రామాల నుంచి మండల కేంద్రంలోని కళాశాలలకు విద్యార్థులు రావాలంటే ఆటోల్లో ప్రయాణించాల్సిన పరిస్థితి. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం ద్వారా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అధికారులు స్పందించి పరిమితికి మించి ప్రయాణాలను అరికట్టాలి.

– షేక్ మస్తాన్‌వలి, నుదురుపాడు

తగిన చర్యలు తీసుకోవాలి



గతంలో ప్రయాణికులను అధికంగా వాహనంలో తీసుకువెళుతుండగా అనేక ప్రమాదాలు సంభవించాయి. తనిఖీలు సరిగా లేనందువల్ల వాహనాల్లో అధికంగా ఎక్కిస్తున్నారు. ఎక్కువ మంది ప్రయాణికులను ఎక్కించుకోకుండా అధికారులు తగిన చర్యలు తీసుకుంటే ప్రమాదాలు సంభవించకుండా ఉంటాయి.

– సీహెచ్ రామమోహన్‌రెడ్డి, 113 తాళ్లూరు

విద్యుత్ స్తంభం మార్చడానికి వెళ్లిన అధికారులకు షాక్

సాక్షి ఎఫెక్ట్

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని పాత జాతీయ రహదారి నుంచి తాడేపల్లి ప్రధాన రహదారికి వెళ్లే మార్గంలో చర్చి వద్ద విద్యుత్ స్తంభం షాక్ కొడుతోందంటూ సాక్షిలో సోమవారం కథనం వెలువడింది. దీనికి స్పందించిన కుంచనపల్లి సబ్‌స్టేషన్ ఏఈ సత్యనారాయణ సిబ్బందితో షాక్ కొడుతున్న విద్యుత్ స్తంభం వద్దకు చేరుకుని ఐరన్ విద్యుత్ స్తంభాన్ని తొలగించే ప్రయత్నం చేశారు. ఇంతలో స్థానికులు కొంతమంది అక్కడకు చేరుకుని ఐరన్ విద్యుత్ స్తంభం తొలగించి, సిమెంట్ స్తంభం వేయడానికి వీలులేదని, ఆ స్తంభం ఇంటి గుమ్మానికి ఎదురుగా ఉందని, దానిని పక్కకు మార్చాలని విద్యుత్ శాఖ అధికారులతో వాగ్వివాదానికి దిగారు. విద్యుత్ స్తంభాన్ని వేరే చోటకు మార్చడం కుదరదని, గత 20 సంవత్సరాలుగా ఈ స్తంభం ఇక్కడే ఉందని ఏఈ సత్యనారాయణ వివరించారు. దానికి స్థానికులు మీరు మారిస్తే మేము ఊరుకోమంటూ గొడవ చేయడంతో షాక్ తిన్న అధికారులు చేసేది లేక వెనుదిరిగారు.



ఏఈతో విద్యుత్ స్తంభం మార్చడానికి వీలులేదని చెబుతున్న స్థానికులు

విద్యుత్ విజిలెన్స్ అధికారుల విస్తృత తనిఖీలు

మేడికొండూరు: మండల పరిధిలోని వివిధ గ్రామాలలో సోమవారం విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు మెరుపుదాడులు నిర్వహించారు. పర్యవేక్షక ఇంజనీర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో డోకిపర్రు సబ్‌స్టేషన్ పరిధిలో కొర్రపాడు, భీమినేనివారిపాలెం, పాలడుగు, మేడికొండూరు, సిరిపురం, వరగాని, మందపాడు, గుండ్లపాలెం గ్రామాల్లో నిర్వహించిన విస్తృత తనిఖీల్లో ఏఈ వెంకటేశ్వరరావు, ఆపరేషన్స్ ఏఈ ఏడుకొండలు, వెంకన్నచౌదరి పాల్గొన్నారు. 32 మంది అధికారులు, 96 మంది సిబ్బంది, 32 బృందాలుగా ఏర్పడి మండలంలోని గ్రామాల్లో 1,839 సర్వీసులు తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో 35 మందికి రూ.1.81 లక్షలు అపరాధ రుసుము విధించినట్లు అధికారులు తెలిపారు. విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని మొదటిసారి తప్పిదానికి అపరాధ రుసుము వేయడం జరుగుతుందని, రెండవసారి తప్పిదానికి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించడం జరుగుతుందన్నారు. ప్రజలు విద్యుత్ చౌర్యంపై 9440812263, 9440812360, 9440812361 నంబర్లకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ దాడులలో డీఈఈలు రవికుమార్, మల్లికార్జున, ప్రసాద్, గురునాథరావు, ఏఈలు కోటేశ్వరరావు, సతీష్‌కుమార్, శివశంకర్, పుల్లారెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న విద్యుత్ విజిలెన్స్ అధికారులు

ప్రజలను నట్టేట ముంచిన బాబుకు ప్రజల్లో తిరిగే అర్హత లేదు



అనంతవరంలో...



యర్రగుంట్లపాడులో...

వైఎస్సార్‌సీపీ మండలాల అధ్యక్షులు నాగమల్లేశ్వరరావు, శివరామిరెడ్డి

అనంతవరం (తాడికొండ): ఎన్నికల సమయంలో అబద్ధపు హామీలు ఇచ్చి ప్రజలను నట్టేట ముంచిన చంద్రబాబుకు ప్రజల్లో తిరిగే అర్హత లేదని వైఎస్సార్‌సీపీ తుళ్లూరు మండల అధ్యక్షుడు మైనేని నాగమల్లేశ్వరరావు అన్నారు. తుళ్లూరు మండలం అనంతవరం గ్రామంలో సోమవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సూపర్-6 పేరుతో ప్రతి ఇంటికి పథకాలు ఇస్తామన్న చంద్రబాబు ఒక్క హామీ కూడా సక్రమంగా నెరవేర్చలేదన్నారు. ఎన్నికల సాక్షిగా మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రజలు అడుగుతున్నారని, గ్రామాల్లో ఎమ్మెల్యే తిరగకుండా సుపరిపాలన పేరుతో ఎల్లో మీడియాలో ప్రచారం చేస్తున్నారని, ప్రజల్లో మాత్రం తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. అనంతరం బాబు నెరవేర్చలేకపోయిన హామీలను క్యూఆర్ కోడ్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు సుంకర శ్రీను, జిల్లా కార్యదర్శి పొప్పుల శేషగిరిరావు, మండల ఉపాధ్యక్షుడు తియ్యగూర వినోద్, యువజన, ఎస్సీ విభాగం అధ్యక్షులు రాంబాబు, అనిల్, నాయకులు ఆరేపల్లి రవి, మేకల రవీంద్ర, మరియదాసు, వరప్రసాద్, సుధీర్, సాంబయ్య, కుమార్, వెంకయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజలను మభ్యపెడుతున్న కూటమి నాయకులు

ఫిరంగిపురం: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కూటమి నాయకులు ప్రజలను మభ్యపెడుతున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి అన్నారు. మండలంలోని యర్రగుంట్లపాడు గ్రామంలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం సోమవారం సాయంత్రం నిర్వహించారు. శివరామిరెడ్డి మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు పథకాలు అందించిన ఘనత ఉందన్నారు. నేడు కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించి ప్రజలకు అన్యాయం చేయడం దారుణమని, కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. క్యూఆర్ కోడ్ పత్రాలను ఆవిష్కరించారు. దాసరి సురేష్, చిట్టా అంజిరెడ్డి, చేవూరి రామమోహన్‌రెడ్డి, షేక్ మస్తాన్‌వలి, బద్దూరి శ్రీనివాసరెడ్డి, సయ్యద్ సైదులు, ఉడుముల పిచ్చిరెడ్డి, చల్లా వెంకటరెడ్డి, మోరంరెడ్డి, వై.హేమలతారెడ్డి, కళ్లం నరేంద్రరెడ్డి, షేక్ అమానుల్లా, కె.రాంబాబు, జి.ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ అరెస్ట్



మంగళగిరి: శనివారం రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టి ఒక వ్యక్తి మృతికి కారణమైన లారీ డ్రైవర్‌తో పాటు లారీని సోమవారం అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకట్ తెలిపారు. రేవేంద్రపాడు వంతెన వద్ద యేళ్ళ వెంకటేశ్వరరావు(83) అనే వృద్ధుడిని లారీ డ్రైవర్ గరికముక్కు ఆదిశేషు లారీతో ఢీ కొట్టగా వెంకటేశ్వరరావు మృతి చెందాడు. కేసు నమోదు చేసిన రూరల్ ఎస్ఐ పారిపోయిన డ్రైవర్‌ను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చేనేత కళాకారుల ర్యాలీ

మంగళగిరి టౌన్: చేనేతలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకున్న సందర్భంగా కృతజ్ఞతగా మంగళగిరి నగర పరిధిలో సోమవారం చేనేత కళాకారులు ర్యాలీ నిర్వహించారు. పాత మంగళగిరి భద్రావతి సమేత భావనారుషి స్వామి వార్ల దేవస్థానం నుంచి హుస్సేన్ కట్ట, మిద్దె సెంటర్, మెయిన్ బజారు మీదుగా లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వరకు 100 అడుగుల చీరతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలీ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్ధయ్య, ఏపీ ఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, టీడీపీ పాలకమండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, చేనేత వృత్తిదారులు, కళాకారులు, చేనేత కుటుంబ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షల పర్యవేక్షణ

తాడేపల్లి రూరల్: సోమవారం నుంచి 14వ తేదీ వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలను ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా తాడేపల్లి కేవీ రెడ్డి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరుగుతున్న పరీక్షలను తెనాలి ఎడ్యుకేషన్ డివిజన్ డిప్యూటీ ఎడ్యుకేషనల్ అధికారి పి.శాంతకుమారి సోమవారం పర్యవేక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విధానంలో విద్యార్థులు పరీక్షలు రాసే విధానాన్ని పరిశీలించారు. ఒకే పుస్తకంలో నాలుగు ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలతో పాటు రెండు సమ్మేటివ్ పరీక్షలు, చివర్లో గ్రాండ్ టెస్ట్ పరీక్షలు రాయాల్సి ఉంటుందని ఆమె తెలిపారు. వీటితో పాటు ప్రాజెక్ట్ వర్క్, విద్యార్థి స్కిల్స్ ఓఎంఆర్ షీటు పొందుపరచి ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు భీమిరెడ్డి తాతిరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు తాడికొండలో న్యూరాలజీ సేవలు

తాడికొండ: నేడు తాడికొండలోని గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో న్యూరాలజీ వైద్య సేవలు ఉచితంగా అందించనున్నట్లు ఆసుపత్రి విభాగం ఒక ప్రకటనలో తెలిపింది. గుంటూరు మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్, ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ సుందరాచారి అవుట్ పేషెంట్ సేవలు అందుబాటులో ఉంటాయని, ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు నరాలు, మెదడుకు సంబంధించిన వైద్య సేవలు అందించబడతాయని, తాడికొండ పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

నేడు పాఠశాలల్లో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ

దుగ్గిరాల: నేడు మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రపంచ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా 19 సంవత్సరాల లోపు బాలబాలికలకు ఆల్బెండజోల్ మాత్రలను ఆరోగ్య, ఆశా కార్యకర్తలు అంగన్‌వాడీ టీచర్ల సహకారంతో పంపిణీ చేయనున్నట్లు ఓ ప్రకటనలో దుగ్గిరాల వైద్యాధికారి డాక్టర్ అబ్దుల్ ఇజాజ్ రెహమాన్ తెలిపారు.

మృతదేహం లభ్యం



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉండవల్లి దళితవాడ కరకట్ట మధ్యలో ఉన్న గుంటూరు చానల్ హెడ్ స్లూయిస్ వద్ద కాలువ నీటిలో గల్లంతైన వ్యక్తి మృతదేహాన్ని తాడేపల్లి పోలీసులు సోమవారం వెలికి తీశారు. ఎస్ఐ స్వామి శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం ఉండవల్లి దళితవాడ కరకట్ట వెంబడి పుష్కరాల నివాసాల్లో బంధువుల ఇంటికి వచ్చి సరదాగా ఈతకు గుంటూరు చానల్‌లోకి దిగిన జంపల భవానీ శంకర్ (35) నీటిలో మునిగి గల్లంతయ్యాడు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆది, సోమవారాల్లో గుంటూరు చానల్‌లో గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టగా గుంటూరు కాలువ హెడ్ స్లూయిస్ సమీపంలో మునిగిపోయిన భవానీ శంకర్ మృతదేహం నీటి ఒరవడికి కొట్టుకుపోయింది. నులకపేట హెడ్ స్లూయిస్ మధ్యలో లభ్యమయిందని, పోస్టుమార్టం నిమిత్తం మంగళగిరి ఏరియా ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించామని, జరిగిన ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ స్వామి శ్రీనివాసరావు తెలిపారు.

కాలేయ వ్యాధులపై గ్రామస్తులకు అవగాహన



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న కేఎల్‌యూ విద్యార్థులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ఫార్మసీ విభాగాల ఆధ్వర్యంలో సోమవారం దుగ్గిరాల మండల పరిధిలోని పెదకొండూరు గ్రామంలో కాలేయ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రొఫెసర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆర్.సుప్రియ మాట్లాడుతూ హెపటైటిస్ (కాలేయం) వ్యాధిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, కొన్ని జాగ్రత్తలు పాటిస్తే కాలేయాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. కలుషిత ఆహారం, నీరు, రక్తం, వాడిన సూదులు తిరిగి వాడడం, టాటూలు వేయించుకోవడం, టూత్ బ్రష్‌లు, బ్లేడ్‌లు తదితర వాటి ద్వారా కాలేయ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని వలంటీర్లు గ్రామస్తులకు వివరించారు. కళ్లు, చర్మం పసుపు రంగులోకి మారటం, మూత్రం ముదురు రంగులో రావడం, ఆకలి తగ్గటం, అలసట, కడుపునొప్పి, వాంతులు లక్షణాలుగా ఉంటాయని తెలిపారు. లివర్ ఫంక్షనింగ్ టెస్ట్, హెపటైటిస్ ప్యానల్, పీసీఆర్ టెస్ట్, అల్ట్రాసౌండ్ స్కాన్ తదితర పరీక్షల ద్వారా వ్యాధిని గుర్తించవచ్చని, హెపటైటిస్‌లో ఎ, బి, సి, డి రకాలు ఉంటాయని వివరించారు. ఎన్ఎస్ఎస్ ఫీల్డ్ కో ఆర్డినేటర్ సురేష్, వలంటీర్లను వర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చక్రవర్తి, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, డీన్ సలహాదారులు డాక్టర్ హబీబుల్లా ఖాన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీకాంత్‌రెడ్డి తదితరులు అభినందించారు.

కార్పొరేట్ శక్తుల గుప్పెట్లో మోదీ ప్రభుత్వం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్



మాట్లాడుతున్న జంగాల అజయ్‌కుమార్

మంగళగిరి టౌన్: ప్రధాని మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల గుప్పెట్లో నడుస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ విమర్శించారు. మంగళగిరి నగర పరిధిలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం పార్టీ నియోజకవర్గ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జంగాల మాట్లాడుతూ మోదీ నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం దేశ ఆర్థిక, పారిశ్రామిక వ్యవస్థలను గుజరాత్ కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేశారని అన్నారు. ఇప్పటికే సర్దుబాటు చార్జీల పేరుతో విద్యుత్ వినియోగదారులను ఎన్డీఏ ప్రభుత్వం దోచుకుంటోందని, స్మార్ట్ మీటర్ల పేరుతో అదానీకి ఊడిగం చేసేందుకు దోచిపెడుతున్నారని మండిపడ్డారు. అమెరికా అధ్యక్షులు ట్రంప్‌ను మోదీ ఒక్క మాట కూడా అనలేకపోతున్నారని విమర్శించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ నిర్లక్ష్యం కారణంగానే దేశంలో ఓటర్ల జాబితాపై గందరగోళం ఏర్పడిందని ఆరోపించారు. ఈ నెల 17, 18 తేదీల్లో జరిగే జిల్లా మహాసభలను, 23, 24, 25 తేదీల్లో ఒంగోలులో జరుగనున్న రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ సహాయ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు, కంచర్ల కాశయ్య, నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, పట్టణ కార్యదర్శి ప్రభాకర్, మండల కార్యదర్శి జాలాది జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచీకరణకు అనుగుణంగా నూతన కోర్సులు

ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ వీఎల్ నరసింహం



మాట్లాడుతున్న ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ నరసింహం

తాడికొండ: ప్రపంచీకరణలో వస్తున్న మార్పులకనుగుణంగా నూతన కోర్సులు వస్తున్నాయని, వాటిని ఎంచుకుని విద్యార్థులు భవిష్యత్‌లో ముందుకు సాగాలని ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ వి.ఎల్. నరసింహం పేర్కొన్నారు. మండలంలోని మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం నిర్వహించిన బీటెక్ మొదటి సంవత్సరం తరగతులను జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు ఉత్తమ విద్యనందించేందుకు చలపతి విద్యా సంస్థలను ప్రారంభించి కోర్సులు అందించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు చదువుతోపాటు, నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. మరో అతిథిగా పాల్గొన్న ఆథోమ్స్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్స్ చైర్మన్ అయ్యప్ప సిగ్గినమ్ మాట్లాడుతూ విద్యార్థి దశలో ప్రాథమిక సూత్రాలపై అవగాహన కలిగి ఉండాల్నారు. అనంతరం అతిథులను చలపతి విద్యా సంస్థల అధినేత వైవీ ఆంజనేయులు సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రాజేష్, సతీష్, మాధవి, డైరెక్టర్ వినయ్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా నాగశ్రీనివాసరావు, డీన్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల కష్టాన్ని దోపిడీ చేసేలా స్మార్ట్ మీటర్లు

రైతు సంఘం మండల కార్యదర్శి చింతల భాస్కరరావు



తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

తాడికొండ: ప్రజల కష్టాన్ని దోపిడీ చేసే విధంగా అదానీ విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించి ప్రజలపై భారం మోపుతున్నారని రైతు సంఘం మండల కార్యదర్శి చింతల భాస్కరరావు అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న విద్యుత్ కార్యాలయంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకస్తూ సంతకాలు సేకరించి జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావుకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వ ఆదేశాలకు లొంగి గత ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు ఒప్పందం చేసుకుని, అదాని సంస్థకు టెండర్లను అప్పగించిందన్నారు. ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ నాయకులు స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని పిలుపునిచ్చారని.. తీరా అధికారంలోకి వచ్చాక స్మార్ట్ మీటర్లను బిగించాలనడం, ఒప్పందాలను రద్దు చేయకుండా కొనసాగించడం రాష్ట్ర ప్రజలను నమ్మక ద్రోహం చేయడమేనన్నారు. విద్యుత్ భారాలను తగ్గిస్తామని హామీ ఇచ్చి సంవత్సరంలో రూ.15,485 కోట్ల సర్దుబాటు చార్జీలను అదనంగా మోపారన్నారు. గృహాలకు స్మార్ట్ మీటర్లు పెట్టవద్దని, షాపులు, సంస్థలకు పెట్టిన మీటర్లు తొలగించాలని, సర్దుబాటు చార్జీలు రద్దు చేసి బిల్లులు తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బాణావత్ భద్రయ్య, జోషి, రైతులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ఉపాధి కల్పించాలని వినతి



ఫిరంగిపురం: మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ప్రభుత్వం కల్పిస్తే ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని సీఐటీయూ ఆటో వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి అన్నారు. యూనియన్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలంటూ తహసీల్దార్ జె.ప్రసాదరావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మస్తాన్‌వలి మాట్లాడుతూ ఉచిత బస్సు పథకం ఏర్పాటు మంచిదే గానీ ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. గత ప్రభుత్వం వాహనమిత్ర పథకంతో డ్రైవర్లకు సహాయం చేసిందని, అదేవిధంగా కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయంగా రూ.25 వేలు ఇవ్వాలని కోరారు. పెట్రోలు, డీజిల్ ధరలను తగ్గించాలన్నారు. కార్యక్రమంలో రేపూడి రామకోటేశ్వరరావు, కృష్ణారెడ్డి, జోసఫ్, రాంబాబు పాల్గొన్నారు.